పక్కాగా ఎస్‌ఏ-I పరీక్షలు నిర్వహించాలి

మంచిర్యాల విద్యావిభాగం, న్యూస్‌టుడే : ఈ నెల 21 నుంచి 28 వరకు జరగనున్న ఎస్‌ఏ-1 పరీక్షలను పక్కాగా నిర్వహించాలని డీఈవో యాదయ్య శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఒకటి నుంచి పదో తరగతి వరకు ఆయా తేదీల్లో సంబంధిత పరీక్షలను ఏర్పాటు చేయాలన్నారు. ఇప్పటికే ప్రాథమిక తరగతులకు సంబంధించిన ప్రశ్నపత్రాలను ఆయా పాఠశాలలకు పంపిణీ చేసినట్లు తెలిపారు. 6 నుంచి 10వ తరగతులకు ఆయా మండల ఎమ్మార్సీ, కస్టోడియన్ హై స్కూల్‌లో భద్రపరిచినట్లు తెలిపారు. పరీక్షల సమయసారిణి ప్రకారం పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఉదయం 8 గంటలకు ప్రశ్నపత్రాలను ఆయా కేంద్రాల నుంచి తీసుకెళ్లాలన్నారు. ప్రశ్నపత్రాల లీకేజీకి పాల్పడితే పాఠశాలలు, ఉపాధ్యాయులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. మండల విద్యాధికారులు తమ పరిధిలోని పాఠశాలల్లో పరీక్షల నిర్వహణను పరిశీలించాలన్నారు.

ఆకట్టుకున్న సైన్సు సెమినార్

మంచిర్యాల విద్యావిభాగం, న్యూస్‌టుడే : విజ్ఞాన అంశాలపై ఆసక్తి పెంచేలా, నూతన సాంకేతికతపై పట్టుసాధించేలా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సైన్సు సెమినార్ ఆకట్టుకుంది. స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం జిల్లా సైన్సు అధికారి సమక్షంలో జిల్లా స్థాయి సెమినార్ పోటీలను నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని 'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, పొటెన్షియల్ అండ్ కన్సర్న్స్' అనే అంశంపై డిజిటల్ తెరపై తమ సెమినార్ ప్రదర్శనను ఇచ్చారు. ఉత్తమంగా నిలిచిన ప్రదర్శనలను న్యాయనిర్ణేతలు విజేతలుగా ఎంపికచేశారు. అనంతరం మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థి రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్టు సైన్సు అధికారి మధుబాబు ప్రకటించారు.


విజేతలకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న నిర్వాహకులు

విజేతలు వీరే..

ప్రథమ : ఆంటోని (10వ తరగతి, కార్మల్ హై స్కూల్, మంచిర్యాల)
ద్వితీయ : అదీబ షహేర్ (10వ, స్లేట్ హై స్కూల్, జన్నారం)
తృతీయ : భవిష్య (9వ, జడ్పీహెచ్ఎస్, బాలికలు, మంచిర్యాల)

జలకాలాట.. ఆరోగ్య బాట

✷ ఈతపై పెరుగుతున్న ఆదరణ ✷ ఇతర దేశాల్లో పాఠ్యాంశంగా బోధన


ఆదిలాబాద్ ఇందిరా ప్రియదర్శిని క్రీడా ప్రాంగణంలో ఈత కొలనులో చిన్నారుల సాధన

న్యూస్‌టుడే, ఆదిలాబాద్ క్రీడావిభాగం : రోజూ ఈతకు వెళితే శరీరానికి చక్కటి వ్యాయామం అవుతుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఫలితంగా ఇటీవల ఉమ్మడి జిల్లాలో ఈతకు ఆదరణ పెరుగుతోంది. కొన్ని ప్రైవేటు కార్పొరేట్ పాఠశాలల్లో మినీ ఈత కొలనులు అందుబాటులో ఉంచి పిల్లలకు శిక్షణ ఇస్తున్నాయి. ఆరోగ్యంపై స్పృహ ఉన్నవారు నేర్చుకుంటున్నారు. వినోదాన్ని, ఆహ్లాదాన్ని పెంపొందించే ఈత విశ్వ క్రీడల్లో అత్యంత జనాదరణ పొందింది. ఇతర దేశాల్లో పాఠ్యాంశంగా బోధిస్తున్నారు. ఈతతో చేకూరే ప్రయోజనాలపై ప్రత్యేక కథనం.

ఉమ్మడి జిల్లాలో ఈత కొలనులు
- ఆదిలాబాద్: 3
- నిర్మల్ : 1
- కుమురం భీం: 1
- మంచిర్యాల 4

ఇతర దేశాల్లో..

ఇతర దేశాల్లో ప్రతి ఒక్కరికి ఈత తప్పనిసరిగా వచ్చి ఉండాలనే నిబంధన, చట్టం ఉంది. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు ఈతలో శిక్షణ ఇస్తున్నారు.

✷ ఇంగ్లాండ్‌లోని అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు తప్పనిసరిగా ఈత నేర్పిస్తున్నారు. జాతీయ పాఠ్య ప్రణాళికలో శారీరక విద్య చట్టాన్ని పక్కాగా అమలు చేస్తున్నారు.

✷ ఆస్ట్రేలియాలో ఎక్కువగా బీచ్ సంస్కృతి ఉంది. తల్లిదండ్రులు తమ పిల్లలకు ఈత నేర్పిస్తామని ధ్రువీకరణ పత్రం రాసి ప్రభుత్వానికి ఇవ్వాలని నిబంధన ఉంది.

✷ యూఎస్‌లోని పాఠశాలల్లో 6 నుంచి 9వ తరగతుల విద్యార్థులు ఈత నేర్చుకోవడం తప్పనిసరి చేసింది.

నాలుగు విధాలుగా ఈదవచ్చు, ఫ్రీ స్టైల్, బటర్‌ఫ్లై, బ్యాక్ స్ట్రోక్, బ్రెస్ట్ స్ట్రోక్.

బటర్‌ఫ్లై..



అత్యంత కష్టతరమైన ఈత బటర్‌ఫ్లై. నేర్చుకోవడానికి దాదాపు నెలరోజులు పడుతుంది. సీతాకోకచిలుక రెక్కలు ఆడించినట్లుగా రెండు చేతులతో నీటిని లాగుతూ ముందుకు కదలాలి. గంట బటర్‌ఫ్లై ఈత కొడితే 988 కెలరీలు ఖర్చవుతాయి.

బ్రెస్ట్ స్ట్రోక్..



నీటిలో కప్ప ఈదినట్లుగా ఉంటుంది బ్రెస్ట్ స్ట్రోక్ ఈత. రెండు కాళ్లతో నీటిని వెనక్కి నెట్టుతూ, రెండు చేతులు వేగంగా ఛాతి వైపు లాగుతూ ముందుకు వెళ్లే ప్రక్రియ. గంట పాటు సాధన చేస్తే 737 కెలరీలు ఖర్చవుతాయి.

ఫ్రీ స్టైల్..



దీనిని సంప్రదాయ ఈత అని కూడా అంటారు. రెండు వారాల్లో నేర్చుకోవచ్చు. గంట పాటు ఫ్రీ స్టైల్ విధానంలో ఈదితే 590-931 కెలరీలు ఖర్చు అవుతాయి.

బ్యాక్ స్ట్రోక్..



నేలపైన పడుకున్నట్లుగా నీటిపైన తేలుతూ ఈత కొట్టేదే బ్యాక్ స్ట్రోక్. రెండు నెలల్లో నేర్చుకోవచ్చు. ముఖం, కళ్లు ఆకాశం వైపు చూస్తూ శ్వాసను ఏకాగ్రతతో మెల్లగా వదలాలి, తీసుకోవాలి. ఈ క్రమంలో రెండు కాళ్లు చేతులతో నీటిని నెట్టాలి. గంట పాటు చేస్తే 500 కెలరీలు ఖర్చవుతాయి.

ఒత్తిడి దూరం..

- డా.క్రాంతికుమార్, ఎండీ జనరల్ ఫిజిషియన్



ఈత ఆరోగ్యానికి చాలా మంచిది. క్రమం తప్పకుండా రోజూ ఈత సాధనతో శరీరానికి మంచి వ్యాయామం లభిస్తుంది. శ్వాస సంబంధిత వ్యాధులు దరికి చేరవు. హృదయ స్పందన నియంత్రణలో ఉంచుతుంది. శరీరంపైన ఒత్తిడిని తగ్గిస్తుంది.

ఉమ్మడి జిల్లాలో గడిచిన ఏడేళ్లలో ఈత రాక 86 మంది మృత్యువాత పడ్డారు.

● ఊబకాయం ఉన్నవారికి చక్కటి వ్యాయామం.



ఇలా చేస్తే ప్రయోజనాలెన్నో..




● నాలుగు గంటల పాటు నడవడం వల్ల ఎన్ని కెలరీలు ఖర్చవుతాయో గంటపాటు ఈత కొట్టడంతో అంతకన్నా ఎక్కువ కెలరీలు ఖర్చు అవుతాయి.

వీరు దూరంగా ఉండాలి : ఆస్తమా ఉన్నవారు, శస్త్ర చికిత్స అయినవారు, చర్మ వ్యాధులతో బాధపడుతున్నవారు, అవయవ మార్పిడి చేసుకున్నవారు దూరంగా ఉండాలి



● చక్కటి నిద్ర పడుతుంది.



● జీర్ణవ్యవస్థ మెరుగుపడి ఆకలి బాగా అవుతుంది.

● రక్తపోటు, మధుమేహం నియంత్రణలో ఉంటాయి.





● గుండె, ఊపిరితిత్తులు, రక్తప్రసరణ, మూత్రపిండాల పనితీరు మెరుగుపడుతుంది.

ఆసక్తి చూపుతున్నారు..: - కొమ్ము కృష్ణ, ఈత శిక్షకుడు, ఆదిలాబాద్



వేసవి సెలవుల్లో మాత్రమే ఈతకు వచ్చేవారు. ఇప్పుడు నేర్చుకునేవారి సంఖ్య పెరుగుతోంది. రోజూ ఉదయం, సాయంత్రం 50 మంది శిక్షణకు వస్తున్నారు. కొత్తవారు, సాధకులు తప్పనిసరి ఈత శిక్షకులు, నిపుణుల పర్యవేక్షణలోనే నీటిలోకి దిగాలి. పూర్తి పట్టు సాధించాక ఒంటరిగా 8 అడుగుల నీటి లోతులోకి వెళ్లాలి. ధైర్యం ఉన్నవారే ఈతలో రాణించగలుగుతారు.

పెంచాలి వేగం.. తీర్చాలి కష్టం

న్యూస్‌టుడే, మంచిర్యాల వైద్యవిభాగం:


జిల్లా కేంద్రంలోని ఓవర్‌బ్రిడ్జి సమీపంలో నిర్మాణం జరుగుతున్న ఆసుపత్రి భవనం

ప్రభుత్వ వైద్య కళాశాలకు అనుబంధంగా జిల్లా కేంద్రంలోని ఓవర్‌బ్రిడ్జి సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న ఆసుపత్రి భవనం నిర్మిస్తున్నారు. రెండు చోట్ల (జీజీహెచ్, ఎంసీహెచ్) సేవలందిస్తున్న ఆసుపత్రులు అనేక ఆశలు పెట్టుకున్నాయి. జీ+3 అంతస్తులతో నాలుగు బ్లాకులుగా భారీ స్థాయిలో నిర్మిస్తున్న భవన నిర్మాణ పనులు తుది దశకు చేరుకుంటున్నాయి. మరో స్లాబు మిగిలి ఉండగా పూర్తయిన స్లాబుల్లో గోడల పనులు జరుగుతున్నాయి. కాస్త వడివడిగానే పనులు చేపడుతున్నా కొంత వేగం పెంచితే అతి త్వరలోనే అందుబాటులోకి వచ్చే అవకాశముంది.

అవస్థల మధ్య ఎంసీహెచ్, జీజీహెచ్‌లో సేవలు

ఓవైపు ప్రస్తుతం ఐబీలో కొనసాగుతున్న జీజీహెచ్ (ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి)కు అనేక సమస్యలు వెంటాడుతున్నాయి. శిథిలావస్థకు వచ్చిన ఓపీ గదులు, స్లాబు పెచ్చులూడుతున్న ఐపీ వార్డులు, అస్తవ్యస్తంగా ఉన్న ఆపరేషన్ గదులతో యాతన పడుతున్నాయి. ఈ కారణంతో ఏడాదిన్నర నుంచి కంటి శస్త్రచికిత్సలు పూర్తిగా నిలిపివేశారు. మరోవైపు గోదావరి తీరాన సేవలు అందిస్తున్న ఎంసీహెచ్ (మాతా, శిశు ఆరోగ్య కేంద్రం)కు వరదముప్పు వెంటాడుతూనే ఉంది. నాలుగేళ్లుగా గోదావరినీరు భవనాన్ని ముద్దాడుతున్నాయి. దీనికి తోడు దూరభారంతో బాధితులు అవస్థలు పడుతున్నారు. దీంతో ఈ రెండు ఆసుపత్రుల ఆశలన్నీ ప్రస్తుతం ఓవర్‌బ్రిడ్జికి (300మీటర్ల దూరం) అతి సమీపంలో నిర్మిస్తున్న భవనంపైనే ఉన్నాయి.

రూ.305 కోట్లతో నిర్మాణం

ప్రభుత్వ వైద్యకళాశాలతో పాటు సంబంధిత అనుబంధ ఆసుపత్రి, అవసరమైన సామగ్రి కోసం గత ప్రభుత్వం రూ.510 కోట్లు నిధులు కేటాయించింది. ఇందులో కళాశాల నిర్మాణానికి రూ.205 కోట్లు కాగా ఆసుపత్రికి రూ.305 కోట్లు. ప్రస్తుతం కళాశాల, వసతి గృహాలు, క్వార్టర్స్ నిర్మాణ పనులు గుడిపేటలో రోడ్లు, భవనాల శాఖ పర్యవేక్షణలో శరవేగంగా జరుగుతున్నాయి. ఆసుపత్రి నిర్మాణం ఓవర్‌బ్రిడ్జి దగ్గర (ప్రస్తుత తాత్కాలిక వైద్య కళాశాల) కొనసాగుతోంది. దీని నిర్మాణ బాధ్యతను తెలంగాణ వైద్య, మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ చూస్తోంది.

అందుబాటులోకి వస్తే ఉపశమనం



నూతన ఆసుపత్రి పనులు వేగంగానే జరుగుతున్నాయి. ప్రస్తుతం జీ+3 అంతస్తులతో నిర్మాణం కొనసాగుతోంది. బాధితులు, వైద్యుల అవసరం రీత్యా మరో అంతస్తు నిర్మించి ఇవ్వాలని కోరుతున్నాం. వచ్చే ఏడాది వర్షాకాలానికి ముందే ఇక్కడ సేవలు మొదలవుతాయి. ఇది అందుబాటులోకి బాధితులకు ఉపశమనం కలుగుతుంది. వరదల నుంచి ఎంసీహెచ్, శిథిలావస్థలో ఉన్న జీజీహెచ్‌కు కష్టాలు తీరుతాయి.


- డా.హరిశ్చంద్రారెడ్డి, జనరల్ ఆసుపత్రి పర్యవేక్షణాధికారి

సర్వే్త్రా ఆశలు

కుటుంబ సభ్యుల నిర్ధారణ ప్రక్రియ పూర్తి


ర్యాలీ గ్రామంలో కుటుంబ నిర్ధారణ సర్వే చేస్తున్న మండల వ్యవసాయాధికారి కృష్ణ

మంచిర్యాల గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లాలో పలు సాంకేతిక కారణాలతో కొందరు రైతులకు రుణ మాఫీ కాలేదు. దీంతో ప్రభుత్వం యాప్‌ను రూపొందించి కుటుంబ సభ్యుల నిర్ధారణ ప్రక్రియ చేపట్టింది. ఇది జిల్లాలో శనివారం ముగియడంతో తమకు ప్రభుత్వం రుణమాఫీ ప్రకటిస్తుందనే ఆశతో రైతులు ఎదురుచూస్తున్నారు.



రుణమాఫీ అందేనా...

ప్రభుత్వం రూ.2 లక్షల లోపు పంట రుణాలను మాఫీ చేస్తామని చెప్పి ఇంతవరకు మాఫీ చేయకపోవడంపై రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాంకేతిక కారణాల పేరుతో అర్హులైన వేలాది మంది రైతులకు రుణమాఫీ అందకపోవడంతో అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. రేషన్‌కార్డులు లేవని, ఒకే కుటుంబంలో రూ.2 లక్షల లోపు రుణాలు రుణం పొందిన రైతులు ఉండగా వారికి మాఫీ చేయలేదని మండిపడుతున్నారు. కుటుంబ సభ్యుల నిర్ధారణ సర్వే, రేషన్ కార్డులు లేని అర్హత కలిగిన రూ.2 లక్షల లోపు పంట రుణాలను సత్వరమే మాఫీ చేయాలని రైతులు కోరుతున్నారు.

రాష్ట్ర స్థాయి అధికారులకు వివరాలు పంపించాం

- కల్పన, జిల్లా వ్యవసాయాధికారిణి, మంచిర్యాల

జిల్లాలో రుణమాఫీ కోసం చేపట్టిన కుటుంబసభ్యుల నిర్ధారణ సర్వే ప్రక్రియ శనివారంతో ముగిసింది. రూ.2 లక్షల లోపు రుణమాఫీ కోసం అర్హులైన రైతుల కుటుంబసభ్యుల నిర్ధారణ సర్వే పూర్తిచేశాం. ఈ వివరాలన్నింటిని రాష్ట్రస్థాయి అధికారులకు పంపించాం. ప్రభుత్వ నిర్ణయం మేరకు రుణమాఫీ ప్రక్రియ ఆధారపడి ఉంటుంది.

అభివృద్ధి పనుల్లో జాప్యం తగదు


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్, పక్కన ఎమ్మెల్యే వివేక్

భీమారం, న్యూస్‌టుడే : చెన్నూరు నియోజకవర్గ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి అన్నారు. జైపూర్ మండల కేంద్రంలోని ఎస్టీపీపీ అతిథిగృహంలో వివిధ శాఖల అధికారులతో శనివారం జరిగిన నియోజకవర్గ స్థాయిలో అభివృద్ధి పనుల నిర్వహణపై సమీక్ష సమావేశంలో జిల్లా పాలనాధికారి కుమార్ దీపక్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మిషన్ భగీరథ, విద్యుత్తు శాఖ, ఆరోగ్యశాఖ, ఉపాధి హామీ, ఆర్అండ్‌బీ అధికారులు మిగిలిన శాఖలతో సమన్వయం చేసుకుంటూ పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు. ప్రజల అవసరాలు, ఆరోగ్యం, పారిశుద్ధ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని అన్నారు.

అక్రమ ఇసుక డంపులు

మంచిర్యాల పట్టణం, న్యూస్‌టుడే: మంచిర్యాలలోని రాళ్లవాగు నుంచి ట్రాక్టర్ యజమానులు అక్రమంగా ఇసుక తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. చర్యలు తీసుకోవాల్సిన అధికారులు మామూలుగా తీసుకుని వదిలేస్తున్నారని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. రాత్రి సమయంలో రాళ్లవాగులో తీసిన ఇసుకను పట్టణంలోని వార్డు నెం.22, సాయి హనుమాన్‌నగర్‌లో గల తుమ్మపొదల్లో డంప్ చేస్తున్నారు. ఆ తర్వాత ఒక్కో ట్రాక్టర్ లోడును రూ.3 వేల నుంచి రూ.3,500కు అక్రమంగా అమ్ముతున్నారని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి రాళ్లవాగు నుంచి అక్రమంగా ఇసుక తరలించకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


మంచిర్యాలలో అక్రమంగా నిలువ చేసిన రాళ్లవాగు ఇసుక

డీజీపీకి భాజపా అధ్యక్షుడి ఫిర్యాదు

మంచిర్యాల సిటీ, న్యూస్‌టుడే : ప్రతిపక్ష పార్టీల నాయకులపై కక్షపూరిత చర్యలు, అక్రమంగా కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించడాన్ని ఖండిస్తూ రాష్ట్ర డీజీపీ డా.జితేందర్‌ని కలిసి ఫిర్యాదు చేసినట్లు భాజపా జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అధికారపార్టీ నాయకుల అండదండలతో కొంతమంది గ్యాంగులుగా ఏర్పడి అలజడులు సృష్టిస్తున్నారని, దాడులు చేస్తున్నారని వివరించినట్లు చెప్పారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రశాంత వాతావరణాన్ని నెలకొల్పేలా చొరవ తీసుకోవాలని కోరినట్లు వెల్లడించారు.


ఏఎస్సైలుగా పదోన్నతి పొందిన అధికారులతో సీపీ శ్రీనివాస్

ప్రజలకు మరింత చేరువ కావాలి

మంచిర్యాలనేరవిభాగం, న్యూస్‌టుడే : రామగుండం పోలీసు కమిషనరేట్ పరిధిలో హెడ్‌కానిస్టేబుళ్లుగా విధులు నిర్వర్తిస్తున్న ఆరుగురు ఏఎస్సైలుగా పదోన్నతి పొందారు. శనివారం వీరికి సీపీ శ్రీనివాస్ తన కార్యాలయంలో పదోన్నతి చిహ్నాలను అలంకరించారు. విధుల్లో పదోన్నతులు మరింత బాధ్యతను పెంచుతాయని సీపీ పేర్కొన్నారు. ప్రజలకు మరింత చేరువగా ఉంటూ మంచి పేరు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. అదనపు డీసీపీ (పరిపాలన) రాజు, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, ఆర్ఐలు దామోదర్, శ్రీనివాస్, పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు పోచలింగం తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతుల్లో రిజర్వేషన్ పాటించాలని డిమాండ్

శ్రీరాంపూర్ గ్రామీణం : సంస్థలో చేపట్టే పదోన్నతుల్లో రిజర్వేషన్ విధానాన్ని పాటించాలని సింగరేణి ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు నీలబోయిన కుమార్ డిమాండ్ చేశారు. శనివారం సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఏరియా కార్యవర్గ సమావేశంలో ప్రధాన కార్యదర్శి లింగమూర్తితో కలిసి మాట్లాడారు.

నిధులు మింగిన ఘనులు

● చెక్‌డ్యాంల నిర్వహణపై పర్యవేక్షణ లేమి



ఈటీవీ – ఆదిలాబాద్: ఒకప్పుడు నీటి చుట్టూ నాగరికత ప్రాణం పోసుకుంటే ఇప్పుడు రాజకీయ గ్రహణం పట్టిపీడిస్తోంది. సాగునీటి వసతి కల్పించటం, భూగర్భ జలాల పెంపునకు ప్రభుత్వం కేటాయించే రూ.కోట్ల చెక్‌డ్యాం పనుల నిర్వహణ అక్రమాలకు ఊతమిచ్చేలా సాగుతోంది. ప్రజాప్రతినిధుల జోక్యంతో అధికారుల అజమాయిషీ లేకుండా పోతోంది. నిధులు నీళ్లలా ఖర్చవుతున్నాయే తప్ప ఆశించిన ప్రయోజనం చేకూరడం లేదు.

రాష్ట్రంలో అత్యధిక వర్షపాతంతో పాటు గుట్టలు, నదులు, వాగులు, సెలయేళ్లతో సహజసిద్ధమైన భౌగోళిక స్థితిగతులతో పెనవేసుకున్న ఉమ్మడి జిల్లాలో పొలాలకు సాగునీటి లభ్యత అందని ద్రాక్షగానే మిగిలిపోతోంది. చెక్‌డ్యాంల నిర్వహణ అస్తవ్యస్తంగా మారుతోంది. నాలుగేళ్లలో ప్రభుత్వం ఉమ్మడి జిల్లాకు 157 చెక్‌డ్యాంలు మంజూరు చేసింది. ఒక్కో చెక్‌డ్యాంకు రూ.2 కోట్లను పరిగణనలోకి తీసుకుంటే రూ.314 కోట్లు మంజూరు చేసింది. ఇందులో ఒక్క ఆదిలాబాద్ జిల్లాలోనే మొదటి దశలో రూ.120 కోట్లు, రెండో దశలో రూ.45 కోట్లు మంజూరు చేసింది. ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాలో చాలాచోట్ల పనులు పూర్తి చేయకుండానే చేసినట్లుగా సర్దుబాటు చేస్తున్నట్లు తెలుస్తోంది. కరోనా కారణంగా మొదటి దశ పనుల నిర్వహణ కొంతమంది ప్రజాప్రతినిధులు, అధికారుల ఇష్టాయిష్టాలతోనే జరిగింది. రెండో దశలో మంజూరైన వాటిలో ఇప్పటికీ చాలా చోట్ల ప్రారంభమే కాలేదు.

రెండు దశల్లో మంజూరైన చెక్‌డ్యాంలు

జిల్లా	మొదటిదశ	రెండోదశ
ఆదిలాబాద్	54	16
ఆసిఫాబాద్	09	11
మంచిర్యాల	16	08
నిర్మల్	23	21

ప్రమాదానికి హేతువు

ఇది భీంపూర్ మండలంలోని ధనోర వాగుపై అంతర్రాష్ట్ర వంతెనను ఆనుకొని రైతుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా నిర్మించిన చెక్‌డ్యాం. రూ.1.70 కోట్లు ఖర్చయినా ఫలితం లేదు. పైగా వర్షాకాలంలో వాగు ఉద్ధృతితో వెనుక జలాలు వంతెనపైకి వచ్చే నీటి ప్రవాహంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది.



☛ ఆదిలాబాద్ మండలం యాపల్‌గూడలో నాణ్యత ప్రమాణాలు పాటించకుండా నిర్మించిన చెక్‌డ్యాం నిరుపయోగంగా మారింది. వేసవిలో నీరే ఉండటం లేదు.

ఖాళీలే..

మంచిర్యాల జిల్లాలో కీలకమైన ఎస్ఈ పోస్టు కనీసం ఇన్‌ఛార్జి బాధ్యతల్లేకుండా ఖాళీగానే ఉంది. నెల, రెండు నెలల్లో పదవీ విరమణ చేసే డీఈఈలను పదోన్నతిపై ఇన్‌ఛార్జి ఎస్ఈగా నియమించే పద్ధతి సాగుతోంది. అయిదు నెలల కిందట జి.శ్రీనివాస్‌రెడ్డి పదవీ విరమణ చేశారు. ఆయన స్థానంలో ఇన్‌ఛార్జి ఎస్ఈగా వచ్చిన మురళీధర్ జూన్ 30న, తర్వాత ఇన్‌ఛార్జిగా నియమితులైన శివకుమార్ జులై 30న, మళ్లీ ఇన్‌ఛార్జిగా బాధ్యతలు చేపట్టిన కొంతం శ్రీనివాస్ సెప్టెంబరు 30న పదవీ విరమణ చేశారు. ఇప్పుడు కనీసం ఇన్‌ఛార్జి కూడా లేరంటే పనుల పర్యవేక్షణ అర్థం చేసుకోవాల్సిందే..

● ఇంద్రవెల్లి, బోథ్, సిరికొండ, జైనూర్, బెజ్జూర్ మండలాల పనులపై ఇంజినీర్లు ఇచ్చిందే పనులు ఉన్నట్లుగా నడుస్తోంది.

● ఆదిలాబాద్ ఎస్ఈ రామును 'ఈనాడు' సంప్రదిస్తే వివరాలేమీ నాకు తెలియదు. అంతా ఈఈ, డీఈల దగ్గరే ఉంటుందని వివరించటం విశేషం.

22న కాంపౌండర్, ఫార్మసిస్టు పోస్టుల భర్తీకి మౌఖిక పరీక్ష

మంచిర్యాల వైద్యవిభాగం, న్యూస్‌టుడే : జాతీయ ఆరోగ్య మిషన్ కింద ఆయూష్ విభాగంలో ఖాళీగా ఉన్న తొమ్మిది (కాంపౌండర్, ఫార్మసిస్టు) పోస్టులను భర్తీ చేసేందుకు 22న మౌఖిక పరీక్ష నిర్వహిస్తున్నట్లు వైద్యారోగ్యశాఖ జిల్లా అధికారి హరీష్‌రాజ్ శనివారం తెలిపారు. పాలనాధికారి కార్యాలయ సముదాయంలోని ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు ఏర్పాటు చేస్తున్నట్లు, అర్హులైన అభ్యర్థులు ధ్రువీకరణపత్రాలతో హాజరుకావాలని సూచించారు. 1:3 నిష్పత్తితో కూడిన ఆయా జాబితా వివరాలను జిల్లా వెబ్‌సైట్‌లో ఉంచినట్లు పేర్కొన్నారు.

ఐటీఐలో తక్షణ ప్రవేశాలు

నస్పూర్, న్యూస్‌టుడే : శ్రీరాంపూర్‌లోని ప్రభుత్వ ఐటీఐలో మిగిలిన సీట్లకు 7వ దశలో స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ సుజాత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరంలో ఖాళీగా ఉన్న సీట్ల కోసం వాక్-ఇన్-స్పాట్ ఈ నెల 30లోపు జరుగుతాయని.. ఆసక్తి గల అభ్యర్థులు కళాశాలలో ఆన్‌లైన్ దరఖాస్తు పత్రంతో పాటు నిజ ధ్రువపత్రాలతో హాజరు కావాలని సూచించారు.


తాటిచెట్టుపై పిడుగుపాటు

హాజీపూర్, న్యూస్‌టుడే : మండలంలో శనివారం రాత్రి ఈదురుగాలులు, ఉరుములు, పిడుగులతో కురిసిన అకాల వర్షానికి ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మండలంలోని పెద్దంపేటలో బొప్పు ఎల్లయ్య ఇంటి సమీపంలో ఓ తాటిచెట్టుపై పిడుగు పడి మంటలు చెలరేగడంతో గ్రామస్థులు ఆందోళనకు గురయ్యారు. పిడుగు పడే సమయంలో ఆ ప్రాంతంలో ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. కాగా మండలంలోని పెద్దంపేట, దొనబండ, టీకనపల్లి, హాజీపూర్ తదితర గ్రామాల్లో భారీ వర్షం కురిసింది.



పిడుగుపాటుకు చెలరేగుతున్న మంటలు

చెరువా.. తామర వనమా



తోటలో పూల సాగు చేసినట్లు కనిపిస్తున్న ఈ దృశ్యం కడెం మండలం కన్నాపూర్ చెరువులోనిది. ఇక్కడి చెరువు నిండా తామరపూలు పూస్తున్నాయి. ఇటీవల దేవీ నవరాత్రులు, బతుకమ్మ పండగకు చాలామంది ఇక్కడి తామరపూలను కోసుకెళ్లారు. చెరువులో ఇలా రోజూ పూలు పూస్తుండటంతో తామర పూల తోటలా కనిపిస్తోంది. నిర్మల్-మంచిర్యాల రహదారిని ఆనుకుని ఉన్న ఈ చెరువులోని తామరలు కనువిందు చేస్తున్నాయి. **- కడెం, న్యూస్‌టుడే**

కల్లు గీతకు తి(తె)ప్పలు



తెప్పపై వెళ్లి కల్లుగీయడానికి చెట్టు ఎక్కుతున్న గీతకార్మికుడు

థర్మకోల్ తెప్పలతో సాధారణంగా గంగపుత్రులు చేపల వేట కొనసాగిస్తారు. కానీ నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండలం బన్సపల్లి శివారులోని గోదావరి నది శ్రీరాంసాగర్ ప్రాజెక్టు వెనుక జలాలు సమీపంలో కొన్ని తాటి, ఈత చెట్లు జలమయం కావడంతో కల్లుగీత కార్మికులు తెప్పల సాయంతో కల్లు సేకరించి జీవనోపాధి పొందాల్సి వస్తోంది. ఏటా గోదావరి జలాలు పూర్తిస్థాయిలో నిండటంతో నీరు తగ్గేవరకు సముందర్‌పల్లి, గుండంపల్లి, టెంబుర్ని గ్రామాల్లోని పలువురు గీతకార్మికులు చెట్ల వద్దకు వెళ్లడానికి తప్పనిసరిగా తెప్పలు వాడాల్సి వస్తోంది.

- న్యూస్‌టుడే, దిలావర్‌పూర్



బన్సపల్లిలో తెప్పపై కల్లుకుండతో వస్తూ...

రైతు బిడ్డలు.. వ్యవసాయాధికారులు

● కర్షకుల ఇంట కొలువుల పంట



వ్యవసాయ పనుల్లో నవీన్ తల్లిదండ్రులు బన్సి-కళ

మామడ, న్యూస్‌టుడే:

వ్యవసాయమే ఆధారంగా జీవించే రైతుల పిల్లలు ప్రయోజకులై కొలువులు సాధిస్తే అంతకు మించిన ఆనందం ఇంకోటి ఉండదు. అనేక ప్రతికూల పరిస్థితులను తట్టుకొని ఏడాదికి ఒకటీ రెండు పంటలు పండించే కుటుంబాల్లో నెలకో దిగుబడి వస్తే ఎంతో ఆనందంగా ఉంటుంది. ఇటీవలే విధుల్లో చేరిన ఈ యువ వ్యవసాయాధికారులది పక్కా కర్షక కుటుంబం. బాల్యం నుంచే తల్లిదండ్రులతో పాటు సాగు పనులు చేసిన అనుభవం వారిది. పాతికేళ్ల వయసులోనే రెండు మూడు ఉద్యోగాలు సాధించి ఇప్పుడు ఏకంగా ఓ మండలానికి అధికారిగా గెజిటెడ్ హోదా పొందిన ఇద్దరు యువకుల నేపథ్యమిదీ...



తల్లిదండ్రుల నర్సవ్వ-మాణిక్‌రావుతో పొలం పనుల్లో గిరిరాజ్

తండా కుర్రోడి తడాఖా..

మామడ మండలం లింగాపూర్ తండాకు చెందిన నునావత్ బన్సి-కళ దంపతుల కుమారుడు నవీన్. ప్రస్తుతం ఈయన పెంబి మండల వ్యవసాయాధికారిగా బాధ్యతలు స్వీకరించారు. రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాలలో ఏజీ బీఎస్సీ మొదటి సంవత్సరంలోనే అనారోగ్యం వల్ల చదువుకు ఆటంకం కలిగింది. డిగ్రీ పూర్తయ్యేందుకు ఓ ఏడాది ఆలస్యమైంది. ఈ క్రమం ఆయనను కొంత కుంగుబాటుకు గురిచేసింది. ఆత్మవిశ్వాసం కూడగట్టుకొని పట్టు సడలన్వికుండా మంచి మార్కులతో ఉత్తీర్ణులయ్యారు. ఆ వెంటనే బ్యాంకు ఉద్యోగాల కోసం శిక్షణకు వెళ్లారు. అనేక పోటీ పరీక్షలు రాశారు. తొలి ఉద్యోగం యూనియన్ బ్యాంకులో గ్రామీణాభివృద్ధి అధికారిగా ఆంధ్రప్రదేశ్‌లో వచ్చింది. ఆ తర్వాత ఎఫ్‌సీఐలో మంచి హోదా గల అధికారిగా ఎంపికైనా బ్యాంకు కొలువులోనే కొనసాగారు.

నవీన్ ఏమంటున్నారంటే..




చిన్నప్పటి నుంచి అమ్మానాన్నల కష్టం చూశాను. రెక్కలు ముక్కలు చేసుకొని చదివించారు. ఎలాగైనా వారి కష్టాలను గట్టెక్కించాలన్న కసితో ముందుకెళ్లాను. పోటీ పరీక్షల్లో రాణించాలంటే సాదాసీదా ప్రయత్నాలతో పని కాదు. పట్టుదల, ప్రణాళిక చాలా ముఖ్యం. సమయం ఎంతో కీలకం. ఎక్కడా వృథా చేయొద్దు. ఏ పరీక్ష రాసినా పాత ప్రశ్నాపత్రాల సాధన బాగా చేయాలి. పెద్ద లక్ష్యం పెట్టుకుంటే ఏదో ఒకటి తప్పకుండా సాధించొచ్చు.

పట్టుదలే పెట్టుబడిగా..

దిలావర్‌పూర్‌కు చెందిన నర్సవ్వ-మాణిక్‌రావు దంపతుల కుమారుడు గిరిరాజ్ తాజాగా లోకేశ్వరం వ్యవసాయాధికారిగా నియామకమయ్యారు. అశ్వారావుపేట వ్యవసాయ కళాశాలలో ఏజీ బీఎస్సీ పూర్తి చేశారు. కేరళ వ్యవసాయ శాఖలో పీజీ చేసేందుకు అవకాశం వచ్చినా ఉద్యోగం సాధించాలన్న తపనతో అనేక పోటీ పరీక్షలు రాశారు. ఇఫ్కోలో మేనేజరుగా ఎంపికై గద్వాలలో పనిచేశారు. ఇంకా మంచి స్థానానికి చేరుకోవాలన్న లక్ష్యంతో గ్రూప్స్, ఎస్సై ఎంపిక పరీక్షలకు సన్నద్ధమయ్యారు. ఈ క్రమంలో ఏవో ఉద్యోగం సాధించి వ్యవసాయాధికారి అయ్యారు.

విజయానికి దగ్గరి దారులు ఉండవు: గిరిరాజ్



తల్లిదండ్రులు ఉద్యోగులైతే ఆర్థికంగా అంత ఇబ్బందులుండవు. పరిస్థితులు అనుకూలిస్తాయి. రైతు కుటుంబాలకు కాస్త భారమే అవుతుంది. ఈ పరిస్థితులను దగ్గరగా చూసి ఎలాగైనా ప్రయోజకుడినై అమ్మానాన్నలను సంతోష పెట్టాలన్న తపన నిత్యం మదిలో మెదిలేది. ఏదైనా సాధించే వరకు ప్రయత్నం ఆపొద్దన్న లక్ష్యం పెట్టుకున్నాను. ఏ విజయం సాధించాలన్న దానికి దగ్గరి దారులంటూ ఏవీ ఉండవు. నిరంతర ప్రయత్నంతోనే ఫలితం వస్తుంది. చాలా మంది ఉద్యోగ ప్రకటన విడుదలయ్యాకే చదవడం మొదలు పెడుతారు. ఎంతో మంది ప్రతిభావంతులున్న ఈ పోటీ ప్రపంచంలో పైపై ప్రయత్నాలతో విజయం కష్టమే.. ఎస్సై, గ్రూప్స్‌కు ముందు నుంచే సన్నద్ధం కావడంతో ఆ పరిజ్ఞానం ఏవో పరీక్షలో నాకు ఉపయోగపడింది.

ఆలోచనలు పరుగెత్తేలా.. నడిచే ప్రయోగశాల

న్యూస్‌టుడే, ఆసిఫాబాద్ అర్బన్

శాస్త్ర సాంకేతికత కొత్త పుంతలు తొక్కుతున్న ప్రస్తుత రోజుల్లో పాఠశాల నుంచే విద్యార్థుల్లో ఆ ఒరవడి సృష్టించాల్సిన అవసరముంది. వసతుల లేమితో కొట్టుమిట్టాడుతున్న ప్రభుత్వ పాఠశాలల్లో ప్రయోగశాలలు ఆశాజనకంగా లేకున్నా.. అత్యాధునిక వసతులు, పరికరాలతో కూడిన సంచార సైన్స్ ల్యాబ్ వాహనాన్ని భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బీహెచ్ఈఎల్) సంస్థ కుమురంభీం జిల్లాకు ప్రత్యేకంగా సమకూర్చింది. గదుల్లో నేర్చుకున్న భౌతిక, రసాయన సిద్ధాంతాలు, వివిధ సూత్రాలను ప్రయోగాలతో అవగాహన కలిగించే అవకాశం ఉండటంతో.. విద్యార్థులకు ఇది ఎంతో ఉపయుక్తంగా మారనుంది. మంత్రి సీతక్క ఈ నెల 16న ఆసిఫాబాద్‌లో దీన్ని ప్రారంభించారు.

● ప్రత్యేకంగా కుమురంభీం జిల్లా విద్యార్థులకు కేటాయింపు

రూ.80 లక్షలతో ఈ సంచార వాహనాన్ని అత్యాధునికంగా తీర్చిదిద్దారు. సెంట్రల్ ఏసీ, ప్రొజెక్టర్, స్క్రీన్, జనరేటర్, శౌచాలయంతో పాటు పాఠశాలల్లోని ల్యాబ్‌లకు భిన్నంగా ప్రయోగ పరికరాల ప్రదర్శన, భద్రపరిచే ఏర్పాట్లు ఉన్నాయి. తెలిసిన విషయాలనే వివిధ పరికరాలతో ఆసక్తికరంగా చూపిస్తూ విద్యార్థుల్లో తెలుసుకోవాలన్న ఆలోచన కలిగేలా పొందుపర్చారు. అయితే ఈ వాహనానికి డ్రైవర్, హెల్పర్, ఇంధనం తదితర ఖర్చుల కోసం ప్రభుత్వం నిధులు కేటాయించాల్సి ఉంది.



సంచార సైన్సు ప్రయోగశాల బస్సు



సంచార సైన్సు ప్రయోగశాలలో భౌతిక, జీవ, గణితశాస్త్రాల ప్రయోగాలు, నమూనాలతో సైన్సు విషయ నిపుణులు

మ్యాజిక్ మయం..

వాహనంలో మ్యాజిక్ తలపించే ప్రయోగాల ప్రదర్శన ఆకట్టుకుంటుంది. మ్యాజిక్ వాటర్ ట్యాప్, న్యూటన్ ఊయల, జడత్వ నియమం, చర్య ప్రతిచర్య, పంజరంలో చిలుక, గుర్రపు చక్రం, పీడన చక్రం, గాలిలో అయస్కాంతం, తదితర భౌతిక, రసాయన, జీవ, గణిత ప్రయోగాలు అద్భుత భావనలు దృశ్య భ్రాంతిని కలిగిస్తాయి.

మ్యాజిక్ వాటర్ ట్యాప్

ఎలాంటి ఆధారం లేకుండానే కుళాయి ఏర్పాటు, అందులోంచి నీరు కిందకు పడుతున్నట్లు కనిపించే ఈ మ్యాజిక్ వాటర్ ట్యాప్ ఆసక్తి కలిగిస్తుంది.



న్యూటన్ ఊయల

వేలాడదీసిన లోలక గుండ్లలో.. ఒక దాన్ని లాగి వదిలితే అవతలి వైపున్న ఒక గుండు అంతే వేగంతో కదులుతుంది. మిగతావి కదలవు. అలానే రెండు, మూడు లాగి వదిలినా.. సమాన సంఖ్యలో అవతలి గుండ్లు కదులుతాయి. న్యూటన్ నియమాల ఆధారంగా ఇది పనిచేస్తుంది.





పీడన చక్రం

చిలుక, గుర్రం..

ఒక చక్రం పైభాగాన ఓ వైపు చిలుక చిత్రం, మరోవైపు పంజరం చిత్రాన్ని ఉంచి చక్రాన్ని గిరగిరా తిప్పితే.. పంజరంలో చిలక ఉన్న భ్రాంతి కలుగుతుంది. అలాగే చక్రంలోని గుర్రపు బొమ్మ సైతం తిప్పినపుడు ముందుకు పరుగెడుతున్నట్లు కనిపిస్తుంది.



ముందుగా ఉపాధ్యాయులకు శిక్షణ

- కటుకం మధుకర్, జిల్లా సైన్సు అధికారి



సంచార ప్రయోగశాల జిల్లాకు కేటాయించడం అభినందనీయం. అత్యాధునిక భావనలు, సౌకర్యాలతో ఉన్న ఈ ప్రయోగశాలను జిల్లాలోని అన్ని ఉన్నత పాఠశాలల వద్దకు తీసుకుపోయి వీలైనంత త్వరగా విద్యార్థులకు అవగాహన కల్పిస్తాం. ముందుగా సైన్సు ఉపాధ్యాయులకు దీనిపై శిక్షణనిస్తాం. ఇందుకోసం ప్రత్యేక కార్యాచరణ రూపొందించాం.

వేడి పుట్టించవు.. మంటలు రావు



వీధి దీపాల్లా కనిపిస్తున్న ఈ లైట్లు సాధారణమైనవి కావు. సాధారణ వీధి దీపాలు వేడిని పుట్టిస్తాయి. ఆదిలాబాద్ జైలు బంకు సమీపంలో త్వరలో ప్రారంభించనున్న సీఎన్‌జీ గ్యాస్ స్టేషన్ వద్ద జిల్లాలోనే మొదటి సారి ఈ అన్‌ఫ్లేమబుల్ లైట్లను ఏర్పాటు చేశారు. ఇవి సాధారణ దీపాలకు భిన్నంగా ఉంటాయి. వీటి వల్ల అక్కడ ఉష్ణోగ్రతలు పెరగదు. ఒక్కోదానికి రూ.5,500 ఉంటుంది. సీఎన్‌జీ గ్యాస్ పంపుల వద్ద వీటిని ఏర్పాటు చేస్తారు. ఒక వేళ పొరపాటున గ్యాస్ లీక్ అయినా మంటలంటుకోవు.

- ఈనాడు, ఆదిలాబాద్ - న్యూస్‌టుడే, ఆదిలాబాద్ నేర విభాగం

జాతీయ స్థాయి క్రికెట్ పోటీలకు లక్ష్మణ్‌సాయి



మంచిర్యాల క్రీడావిభాగం, న్యూస్‌టుడే : పాఠశాల క్రీడా సమాఖ్య జాతీయ స్థాయి పోటీలకు జిల్లా క్రీడాకారుడు ఎంపికయ్యాడు. ఇటీవల జరిగిన జిల్లా, రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీల్లో మెరుగైన ఆటతీరును కనబరుస్తూ నిలకడగా రాణిస్తున్న వేములపల్లి లక్ష్మణ్‌సాయి తెలంగాణ జట్టులో చోటు దక్కించుకున్నాడు. త్వరలో బిహార్‌లో జరగనున్న ఆయా పోటీల్లో పాల్గొననున్నాడు. లక్ష్మణ్ ప్రస్తుతం మంచిర్యాల కేంద్రీయ విద్యాలయంలో తొమ్మిదో తరగతి చదువుతుండగా స్థానిక గురు క్రికెట్ అకాడమీలో శిక్షకుడు దుర్గాప్రసాద్ సమక్షంలో శిక్షణ తీసుకుంటున్నాడు.

మొలకలు.. కాస్త భిన్నంగా





కాస్త రుచికరంగా ఇలా సిద్ధం చేస్తూ..

న్యూస్‌టుడే, మంచిర్యాల సిటీ: ఆరోగ్యకరమైన అలవాట్లను జిల్లా కేంద్రానికి పలువురు రోజుకో రకంగా పరిచయం చేస్తున్నారు. ఇటీవల కాలంలో గ్రీన్, లెమన్, బెల్లం టీ, చిరుధాన్యాల జావ ఇలా అనేక రకాల ఆరోగ్యాన్ని పెంచే కేంద్రాలను అందుబాటులో తీసుకొచ్చారు. ప్రజలు సైతం వీటిని తీసుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ప్రస్తుతం మంచిర్యాల పట్టణానికి మరోరకం ఆరోగ్యకరమైన ఆహారాన్ని తాగేది కాకుండా తినే పదార్థం వినియోగంలోకి తీసుకొచ్చారు. చెన్నూరుకు చెందిన రాజు అనే యువకుడు కాస్త వినూత్నంగా పరిచయం చేస్తున్నాడు. హెల్తీ, స్పైసీ మొలకలంటూ కాస్త భిన్నంగా అప్పటికప్పుడు సిద్ధం చేసి అందిస్తున్నారు. హంగు, ఆర్భాటాలు లేకుండా మిర్చి బండి మాదిరిగా ఏర్పాటు చేసి జిల్లావాసుల ఆరోగ్యాన్ని పంచు(పెంచు)తున్నారు.

మొలకలు (ఉలవలు, మొక్కజొన్న, పెసర్లు, ఎర్ర పెసర్లు, బబ్బర్లు, శనగలు, పల్లీలు) ఆరోగ్యానికి మంచిందంటారు. కొంతమంది వీటితోనే దినచర్య ప్రారంభిస్తారు. ఎప్పటినుంచో అందుబాటులో ఉన్నా ప్రస్తుతం ఆరోగ్యకరమైన అలవాట్లు పెరగడంతో వీటికీ మరింత ప్రాధాన్యం పెరిగింది. కొందరు కాస్త ఓపికతో వారి వారి నివాసాల్లోనే విత్తనాలను రాత్రి నానబెట్టి మొలకెత్తిన అనంతరం పచ్చివే ఉదయం తింటుంటారు. వీటిని తినడం ఆరోగ్యానికి మంచిదే అని తెలిసినా పచ్చివి తినాలంటే కొంతమంది ఇబ్బంది పడుతుంటారు. వారి కోసమే ఈ బండిని అందుబాటులోకి తీసుకొచ్చినట్లుగా ఉంది. వేసివేయనట్లుగా నూనె, కాస్త ఉప్పు, కారంతో ఫ్రై చేస్తున్నారు. చివరగా కొంత నిమ్మరసం కలిసి ఆహా అనేలా రుచికరంగా సిద్ధంచేసి విక్రయిస్తున్నారు.

కవ్వాల్‌లో కలియ తిరిగి.. అందాలు తిలకించి...!



అటవీశాఖ అధికారులతో డిప్యూటి కన్జర్వేటర్ మాధవరావు

జన్నారం, న్యూస్‌టుడే : అటవీశాఖ ప్రధాన కార్యాలయంలో డిప్యూటి కన్జర్వేటర్‌గా విధులు నిర్వర్తిస్తున్న సిరిపురం మాధవరావు శనివారం కవ్వాల్ పులుల సంరక్షణ కేంద్రంలో పర్యటించారు. ఇక్కడి అందాలను తిలకించి తన కెమెరాలో బంధించారు. నిర్మల్ జిల్లా కేంద్రంలో శుక్రవారం జరిగిన శాఖాపరమైన సమావేశానికి హాజరైన ఆయన రాత్రి జన్నారంలోనే బస చేశారు. శనివారం ఉదయం అడవిలోకి వెళ్లి బైసన్‌కుంట, గోండుగూడ బేస్ క్యాంపు తదితర ప్రాంతాలను ఇక్కడి అటవీశాఖ అధికారులతో కలిసి పర్యటించారు. అనంతరం మంచిర్యాల జిల్లా కేంద్రంలో జరిగిన సమావేశానికి హాజరయ్యారు. డిప్యూటీ రేంజి అధికారి తిరుపతి, సెక్షన్ అధికారులు హనుమంతరావు, కిరణ్మయిజ్యోతి, బీట్ అధికారులు రుబీనా, లాలుబాయి తదితరులు పాల్గొన్నారు.

అపరిచితులకు వివరాలు చెప్పొద్దు

కుంటాల: సైబర్ నేరగాళ్లపై అప్రమత్తంగా ఉండాలని ఏఎస్సైలు దేవ్‌రావు, రాందాస్ సూచించారు. మండలంలోని వెంకూర్‌లో శనివారం అవగాహన కల్పించారు. అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసి బ్యాంకు, ఆధార్ వివరాలు, ఫోన్‌కు వచ్చిన ఓటీపీ చెప్పమంటే తిరస్కరించాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ వ్యక్తిగత సమాచారాన్ని ఇతరులతో పంచుకోవద్దని పేర్కొన్నారు. సూచనలు చేస్తూ సందేహాలను నివృత్తి చేశారు.

రాష్ట్ర స్థాయి కళోత్సవ్‌కు విద్యార్థిని ఎంపిక



నృత్యం చేస్తున్న సహస్రగౌడ్

జన్నారం, న్యూస్‌టుడే : మంచిర్యాల జిల్లా జన్నారం మండల కేంద్రంలోని స్లేట్ హైస్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతున్న గాజుల సహస్రగౌడ్ రాష్ట్ర స్థాయి కళోత్సవ్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 16న నిర్వహించిన కళోత్సవ్-2024 గాను జిల్లా స్థాయి కూచిపూడి నృత్యాలలో సహస్ర ఉత్తమ ప్రతిభ కనబరిచారు. నవంబర్ 1న జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో ఆమె పాల్గొంటారు. ఈ మేరకు పాఠశాల నిర్వాహకులు విద్యార్థిని అభినందించారు.

సౌత్‌జోన్ అథ్లెటిక్స్‌లో మెరిసిన కార్తిక్



రాథోడ్ కార్తిక్

ఆదిలాబాద్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే : ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరులో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి సౌత్‌జోన్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లా విద్యార్థి మెరిశాడు. ట్రయాథ్లాన్(60మీ., 600మీ.ల పరుగు, లాంగ్‌జంప్) క్రీడాంశంలో బజార్‌హత్నూర్ మండలం జాతర్ల గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాలకు చెందిన రాథోడ్ కార్తిక్ మొదటి స్థానంలో నిలిచి పసిడి పతకం సాధించాడు. ఆయనకు జిల్లా అథ్లెటిక్స్ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అడ్డి భోజారెడ్డి, పి.రాజేశ్, జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి, పెటా ప్రధాన కార్యదర్శి ఎన్.స్వామి, కోచ్ సునంద్ ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

నస్పూర్, న్యూస్‌టుడే:

? పురపాలికలోని పటేల్ కాలనీలో సరైన మురుగు కాలువలు నిర్మించకపోవడంతో నివాసాల నుంచి వచ్చిన మురుగు నీరు నిలిచిపోతుంది.
- స్థానికులు, పటేల్ కాలనీ

✔ పరిశీలించి చర్యలు తీసుకుంటాం. - సతీష్, నస్పూర్ పుర కమిషనర్

మద్యానికి బానిసై యువకుడి ఆత్మహత్య

జన్నారం, న్యూస్‌టుడే : నిర్మల్ జిల్లా దస్తురాబాద్ మండలం మున్యాల్ గ్రామానికి చెందిన యెమునూరి రాజేశం (27) మద్యానికి బానిసై కలమడుగు గోదావరి వంతెన వద్ద పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. జన్నారం ఎస్సై-2 రాథోడ్ తానాజీ తెలిపిన వివరాల ప్రకారం... యెమునూరి రాజేశం కొంత కాలంగా తాగుడుకు బానిసయ్యాడు. వడ్రంగి పనులు చేసేందుకు కొంత మంది వద్ద డబ్బులు అడ్వాన్సుగా తీసుకొని వారికి ఎలాంటి పనులు చేయకుండా తిరిగే వాడు. కొందరు డబ్బులు ఇవ్వాలని ఇంటికి వచ్చి అడిగే వారు. ఈ నేపథ్యంలో మూడు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిన రాజేశం బుట్టాపూర్‌లోని బంధువుల ఇంట్లో శుక్రవారం ఉన్నాడు. తిరిగి శనివారం అక్కడి నుంచి వెళ్లిన అతను మధ్యాహ్నం కలమడుగు గోదావరి వంతెన వద్ద పురుగు మందు తాగాడు. స్థానికులు గమనించి బంధువులకు తెలియజేశారు. చేరుకున్న రాజేశం బంధువులు చనిపోయింది అతనేనని నిర్ధారించారు. మృతుని తల్లి రాజవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.


రాజేశం

అక్రమ మట్టి తవ్వకాలు.. వాహనాలు సీజ్

భీమారం, న్యూస్‌టుడే : మండలంలో అక్రమ మట్టి తవ్వకాలకు పాల్పడుతున్న ఒక జేసీబీ, 3 ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఎస్సై రాములు తెలిపారు. ఆయన కథనం మేరకు.. గొల్ల వాగు జలాశయం కట్ట (బఫర్ జోన్ పరిధి) సమీపంలో శనివారం అక్రమంగా మట్టి తవ్వకాలు జరుపుతూ తరలింపు చేస్తున్నట్టు లస్కర్లు ఇచ్చిన సమాచారం మేరకు జైపూర్ డీఈ ప్రవీణ్‌కుమార్ ఆదేశాలతో వర్క్ ఇన్‌స్పెక్టర్ తువ్వ కుమార్ అక్కడికి చేరుకుని వాహనాలను అడ్డుకుని పోలీసులకు, రెవెన్యూ అధికారులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకుని జేసీబీ, ట్రాక్టర్లను సీజ్ చేశారు. వర్క్ ఇన్‌స్పెక్టర్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.


ట్రాక్టర్‌లో మట్టిని నింపుతున్న జేసీబీ

ద్విచక్ర వాహన దొంగలు అరెస్టు

నస్పూర్, న్యూస్‌టుడే : ద్విచక్ర వాహనాల దొంగలను శ్రీరాంపూర్ పోలీసులు అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. వారి వద్ద నుంచి 4 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. శ్రీరాంపూర్ పోలీస్ స్టేషన్‌లో శనివారం జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్ వివరాలు వెల్లడించారు. గోదావరిఖనికి చెందిన అజ్మీరా అక్షయ్ కుమార్, దొంతుల ప్రశాంత్, సెల్వ, పృథ్వి నలుగురు జల్సాలకు అలవాటు పడి శ్రీరాంపూర్, జైపూర్, రామగుండం ఏరియాలో ద్విచక్ర వాహనాలను అపహరించుకుపోయారు. వారు దొంగిలించిన వాహనాలను మంచిర్యాలలో విక్రయించడానికి వెళ్తున్నారు. ఈ క్రమంలో శ్రీరాంపూర్ పోలీసులు జీఎం కార్యాలయం వద్ద వాహనాలు తనిఖీ చేయగా సరైన పత్రాలు లేని వాహనాలను గుర్తించి విచారణ చేపట్టారు. కాగా దొంగతనం చేసినట్టు నలుగురు ఒప్పుకోవడంతో వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని ఏసీపీ పేర్కొన్నారు. నిందితులను పట్టుకున్న శ్రీరాంపూర్ సీఐ వేణు చందర్, ఎస్సై సంతోష్, కానిస్టేబుళ్లు శ్రీను, సత్యంలను అభినందించారు.


దొంగల అరెస్టును చూపుతున్న పోలీసులు

ప్రతిభ చాటి.. బహుమతి గెలిచి

మంచిర్యాల విద్యావిభాగం, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలోని చుక్కా రామయ్య హై స్కూల్‌లో శనివారం 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభ నష్టాలు, విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు జరిగాయి. పాఠశాలకు చెందిన 8, 9, 10 తరగతుల విద్యార్థులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారు. పోటీల అనంతరం చక్కగా వ్యాసం రాసిన విద్యార్థులను విజేతలుగా ఎంపికచేశారు. ప్రథమ స్థానంలో పి. అశ్విత్(10వ), ద్వితీయ స్థానంలో జె.సంకీర్తన(10వ), తృతీయ స్థానంలో జి.రిశ్వాంత్(10వ)లు నిలిచారు. విజేతలకు ప్రిన్సిపల్ కొమ్ము దుర్గాప్రసాద్, బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. నిర్వాహకులు తిరుపతి, సంతోష్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న పాఠశాల నిర్వాహకులు

వెలుగులు పంచిన జీవితాల్లో చీకట్లు



న్యూస్‌టుడే, కాసిపేట

దేశానికి వెలుగులు పంచే సింగరేణి సంస్థ భూములను ధారాదత్తం చేసిన రైతులకు తిప్పలు తప్పడం లేదు. వ్యవసాయ భూములను కోల్పోయిన రైతులు సింగరేణి ద్వారా పరిహారం పొందారు. ముంపునకు గురైన మిగులు భూములకు పట్టాలు రాక ప్రభుత్వం నుంచి వస్తున్న రైతు బంధు, రైతు బీమా, పంట రుణాలు, కిసాన్ సమ్మాన్ పథకాలకు దూరమవుతున్నారు. ఉదాహరణకు ఒక రైతుకు మూడు ఎకరాల భూమి ఉంటే, రెండు ఎకరాలు సింగరేణి ఉపరితల గనిలో ముంపునకు గురైతే, మిగతా ఎకరం భూమి పట్టా పొందాలంటే రెండు ఎకరాల భూమి ధరణి నుంచి తొలగించాలి. కానీ అధికారులు నిర్లక్ష్యం కారణంగా మూడేళ్లుగా ధరణి నుంచి భూమి తొలగించడం లేదు. ఈ బాధిత రైతులు తహసీల్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న కలెక్టర్ పరిధిలో పెండింగ్‌లో ఉన్నాయని స్థానిక అధికారులు చేతులు దులుపుకుంటున్నారు.

కాసిపేట మండలంలోని పెద్దనపల్లి శివారులో సింగరేణి ఆధ్వర్యంలో నూతనంగా 100 అడుగుల వెడల్పుతో నూతన రహదారి నిర్మాణం చేపడుతున్నారు. ఈ దారిలో ముంపునకు గురైన రైతుల భూములకు పరిహారం పొందారు. భూములు కోల్పోయిన రైతుల భూములను ధరణిలో తొలగించలేదు. దీంతో నూతన పట్టాదారు పాసుపుస్తకం కోసం దరఖాస్తు చేసుకునేందుకు మీ సేవ కేంద్రాలకు వెళ్తే ముంపునకు గురై భూమి తొలగించిన తర్వాతే దరఖాస్తు చేసుకొనే అవకాశం ఉంటుందని చెబుతున్నారు. అధికారులు ధరణిలో నుంచి తొలగించక, నూతన పట్టాదారు పాసు పుస్తకాలు రాక రైతులు ప్రభుత్వ పథకాలకు దూరమవుతున్నారు.

న్యాయం చేయండి



పెద్దనపల్లి శివారులో పల్లె మైసయ్యకు చెందిన 2.20 గుంటల భూమి ఉంది. ఇందులో నుంచి రహదారి నిర్మాణానికి మూడు గుంటల భూమి ముంపునకు గురైంది. ఆ భూమికి పరిహారం పొందారు. నేటికి ధరణిలో 2.20 ఎకరాల భూమి చూపిస్తుండగా ముంపునకు గురైన మిగతా భూమి ధరణిలో నుంచి తొలగించలేదు. 2.20 గుంటల భూమికి ఇది వరకు రైతు బంధు సైతం వచ్చింది. పరిహారం పొందిన మూడేళ్ల నుంచి రైతు బంధు సైతం రావడం లేదని రైతు చెబుతున్నారు. ముంపునకు గురైన భూమి తొలగిస్తే మళ్లీ ధరణిలో నమోదైతే అప్పటి నుంచి ప్రభుత్వ పథకాలకు అర్హత సాధిస్తారని అధికారులు చెబుతున్నారు. మూడు గుంటల భూమి తొలగించాలని తహసీల్ కార్యాలయానికి వెళ్తే అధికారులు కలెక్టర్ దగ్గరికి వెళ్లాలని చెబుతున్నారు. అధికారులు స్పందించి ముంపునకు గురైన భూమి తొలగించి, మిగతా భూమి ధరణిలో ఎక్కించాలి.


మందమర్రి లిటిల్‌ఫ్లవర్ పాఠశాలలో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఉపాధ్యాయులు

వ్యాసం రాసి.. విజేతగా నిలిచి


మందమర్రి పట్టణం, రామకృష్ణాపూర్ న్యూస్‌టుడే: మందమర్రి లిటిల్‌ఫ్లవర్ పాఠశాలలో ఈనాడు ఆధ్వర్యంలో 8, 9, 10వ తరగతి విద్యార్థులకు ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభ నష్టాలు, విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఇందులో పి.అక్షిత్ (10వ తరగతి) ప్రథమ, ఎస్.అభిజ్ఞ (10వ తరగతి) ద్వితీయ, అశ్విత (8 తరగతి) తృతీయ స్థానంలో నిలిచి ప్రతిభ చాటారు. విజేతలకు వైస్ ప్రిన్సిపల్ ప్రవీణ్‌కుమార్‌తో పాటు ఉపాధ్యాయులు రాజేశం, అంజలి, సదానందం బహుమతులు అందజేసి అభినందించారు.

ఉచితంగా రక్త పరీక్షలు

హాజీపూర్ : సమస్త ఆరోగ్య ప్రచారంలో భాగంగా మండలంలోని వేంపల్లిలో శనివారం దిశ మంచిర్యాల ఆధ్వర్యంలో గ్రామస్థులకు ఉచితంగా రక్త పరీక్షలు చేశారు. హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. వైద్యాధికారిణి డా.ప్రసన్న, డీఎస్ఆర్‌సీ కౌన్సిలర్ నరేందర్‌రెడ్డి, ల్యాబ్ టెక్నీషియన్ రాజేందర్, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా వంగ మహేందర్‌రెడ్డిని గెలిపించుకోవాలి

భీమారం, న్యూస్‌టుడే : ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పీఆర్‌టీయూ టీఎస్ అధికారిక అభ్యర్థి వంగ మహేందర్‌రెడ్డిని గెలిపించుకోవాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాసపల్లి రవి అన్నారు. జైపూర్ మండలంలోని పౌనూర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు రాజన్న, పాఠశాల ప్రధానోపాధ్యాయులు స్వర్ణ, ఉపాధ్యాయులు మల్లేశ్, పావని, వివేక్, సంతోష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.


పౌనూరులో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రతాలను చూపిస్తున్న ఉపాధ్యాయ సంఘం నాయకులు

ఉత్సాహంగా ప్రతిభా పాటవ పోటీలు

బెల్లంపల్లి పట్టణం, న్యూస్‌టుడే: బెల్లంపల్లి పట్టణంలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల(సీఓఈ)లో ఈనాడు ఆధ్వర్యంలో ఇంటర్నెట్ వినియోగంపై లాభనష్టాలు, విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. 8, 9, 10 తరగతుల విద్యార్థులు పరీక్ష రాశారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన ఎం.కార్తీక్, అరుణ్‌సందేశ్, అక్షయ్‌కుమార్‌లకు ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ శ్రీధర్ బహుమతులు అందజేశారు. విద్యార్థులంతా చరవాణులతో కాకుండా పుస్తకాలతోనే కుస్తీపడితే మంచి ఫలితాలు వస్తాయని ప్రిన్సిపల్ పేర్కొన్నారు. కళ్లకు ఎలాంటి హాని జరగదని చెప్పారు. ఉపాధ్యాయులు విజయ్‌సాగర్, విజయ్‌కుమార్, తిరుపతి, ఎండీ. ముస్తాక్, శ్రీకాంత్, స్రవంతి పాల్గొన్నారు.


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ శ్రీధర్

ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

జన్నారం : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రవి డిమాండ్ చేశారు. జన్నారం మండలం మురిమడుగు గ్రామ శివారులో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. మండల కార్యదర్శి అశోక్, నాయకులు లింగన్న, ప్రమీళ, బుచ్చన్న, రాజు, రాజన్న, లక్ష్మణ్, అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న దళిత సంఘాల ఐక్యవేదిక నాయకులు

23 నుంచి పట్టణ భరోసా బాట

బెల్లంపల్లి పట్టణం, న్యూస్‌టుడే : దళిత సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఈ నెల 23 నుంచి నవంబరు 8 వరకు నిర్వహించే పట్టణ భరోసా బాట కరపత్రాలను శనివారం తిలక్‌మైదానంలో ఆవిష్కరించారు. బస్తీల్లో నివసిస్తున్న దళిత, గిరిజన ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పన కోసం కృషి చేస్తామని చెప్పారు. ఐక్యవేదిక ముఖ్య సలహాదారుడు చిన్నరాజం, పట్టణ అధ్యక్షుడు రాజేష్, ప్రధాన కార్యదర్శి ఐలయ్య, పట్టణ ఉపాధ్యక్షుడు రాజలింగు, నాయకులు గోపి, శంకర్‌బాబు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కరాటే పోటీలకు ఎంపిక

రామకృష్ణాపూర్, న్యూస్‌టుడే : మందమర్రి పట్టణంలోని ఒర్రెగడ్డ జడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాలకు చెందిన పిట్టల శివకృష్ణ రాష్ట్ర స్థాయి కరాటే పోటీలకు ఎంపిక అయినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మజ తెలిపారు. శనివారం నస్పూర్‌లో నిర్వహించిన 68వ జోనల్ లెవెల్ కరాటే ఎంపిక పోటీల్లో అండర్- 50 కేజీల విభాగంలో శివకృష్ణ పాల్గొని ప్రతిభ చాటినట్లు తెలిపారు. సంగారెడ్డి జిల్లాలో నవంబర్ 2 నుంచి 4వ తేదీ వరకు నిర్వహించే రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో పాల్గొంటారని ఆమె తెలిపారు.


శివకృష్ణ

జోనల్ స్థాయి క్రికెట్..

జన్నారం, న్యూస్‌టుడే : మండల కేంద్రంలోని స్లేట్ ఎక్స్‌లెన్స్ ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న ఏనుగు సుప్రీత్‌రెడ్డి అండర్-17 విభాగంలో జిల్లా స్థాయిలో సత్తాచాటి జోనల్‌కు ఎంపికయ్యాడు. ఈ నెల 18న మంచిర్యాల జిల్లా కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీలలో ప్రతిభ కనబరిచాడు. ఉమ్మడి జిల్లా జోనల్ స్థాయి పోటీలకు ఎంపికైన సుప్రీత్‌రెడ్డిని పాఠశాల నిర్వాహకులు అభినందించారు.


నెట్ ప్రాక్టీస్ చేస్తున్న సుప్రీత్‌రెడ్డి


కబడ్డీ ఆడుతున్న బాలికలు

జిల్లా స్థాయి కబడ్డీ..

తాండూరు, న్యూస్‌టుడే: తాండూరు మండలం అచ్చలాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో మంచిర్యాల జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో శనివారం అండర్- 17 బాలికల కబడ్డీ ఎంపిక పోటీలను నిర్వహించారు. ఉమ్మడి జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రాంచందర్, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, పోటీల పర్యవేక్షకులు రామ్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పోటీలు ప్రారంభం

నస్పూర్, న్యూస్‌టుడే: నస్పూర్ ప్రెస్‌క్లబ్‌లో శనివారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 68వ జోనల్ లెవల్ కరాటే ఎంపిక పోటీలు నిర్వహించారు. పుర ఛైర్మన్ సుర్మిళ్ల వేణు, కరాటే అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ శివ మహేష్‌లు ప్రారంభించారు. అండర్ -14, 19 విభాగంలో నిర్వహించిన పోటీల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి 100 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు త్వరలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని వారు పేర్కొన్నారు.


నస్పూర్‌లో కరాటే పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

దేవాదాయ, ధర్మాదాయ సంయుక్త కమిషనర్ ప్రత్యేక పూజలు

దండేపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే : దండేపల్లి మండలం గూడెం సత్యనారాయణ స్వామి వారిని శనివారం దేవాదాయ, ధర్మాదాయ శాఖ రీజినల్ సంయుక్త కమిషనర్ రామకృష్ణారావు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా వారికి పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆయనకు స్వామి వారి చిత్రపటం బహుకరించి ఘనంగా సత్కరించారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, అర్చకులు పాల్గొన్నారు.


సత్యదేవున్ని దర్శించుకుంటున్న దేవాదాయ ధర్మాదాయ శాఖ సంయుక్త కమిషనర్

వినూత్న ఆలోచన.. విస్తృత ప్రయోజనం

చెన్నూరు గ్రామీణం, న్యూస్‌టుడే: ఉపాధ్యాయులు పాఠశాలలోనే పోషకుల సమావేశాలు ఏర్పాటు చేయడం అంతటా చూస్తుంటాం. కానీ చెన్నూరు మండలంలోని పొక్కూరు జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు దత్తకుమార్ శనివారం విస్తృత ప్రయోజనం కలిగేలా వినూత్నంగా పోషకుల సమావేశాలను నిర్వహించారు. పొక్కూరు పాఠశాలతో పాటు అనుబంధ గ్రామమైన బీరెల్లికి వెళ్లి అక్కడ పోషకులతో సమావేశం నిర్వహించారు.

జీతాలు ఇవ్వాలని ధర్నా

రామకృష్ణాపూర్, న్యూస్‌టుడే : మందమర్రి ఏరియా కేకే ఓసీ ఆర్‌వీఆర్ ఓబీ క్యాంపులో పని చేసే వాహన చోదకులకు రెండు నెలలుగా జీతాలు ఇవ్వట్లేదని వారు నిరసన వ్యక్తం చేశారు. శనివారం ఓబీ ఎదుట ధర్నా చేపట్టి చెల్లించాల్సిన జీతాలను వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాసిపేట ఎస్సై ప్రవీణ్ కుమార్ అక్కడికి చేరుకొని ఏరియా జీఎం దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

యువకుడి అదృశ్యంపై కేసు

మంచిర్యాల నేరవిభాగం, న్యూస్‌టుడే: మంచిర్యాలలోని అశోక్‌రోడ్‌లో నివాసం ఉంటున్న యువకుడు ఠాకూర్ కిరణ్‌సింగ్ ఈ నెల 17న చెన్నై వెళ్తున్నట్లు చెప్పి ఇంట్లో నుంచి బయలుదేరాడు. తర్వాత ఎలాంటి ఆచూకీ లేకుండా పోయినట్లు మంచిర్యాల సీఐ ప్రమోద్ కుమార్ తెలిపారు. స్థానిక శ్రీ లక్ష్మీనారాయణ జువెల్లర్స్‌లో పనిచేస్తున్న కిరణ్‌సింగ్ ఈ నెల 17న సాయంత్రం 5 గంటలకు నవజీవన్ ఎక్స్‌ప్రెస్ రైలులో ఎక్కి చెన్నై వెళ్లి తిరిగిరాలేదని యువకుడి తండ్రి బాలాజీసింగ్ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

దేవాలయాలపై దాడులకు నిరసనగా ధర్నా

బెల్లంపల్లి పట్టణం : హిందూ దేవాలయాలపై దాడులకు నిరసనగా శనివారం విశ్వ హిందూ పరిషత్, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం ఆర్డీఓ హరికృష్ణకు వినతి పత్రం అందజేశారు. వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు రాజలింగు, జిల్లా కార్యదర్శి రమేష్, జిల్లా ఉపాధ్యక్షురాలు కనకతార, భజరంగ్‌దళ్ పట్టణ సంయోజక్ చక్రవర్తి పాల్గొన్నారు.

'భారాస పాలనలో అభివృద్ధి శూన్యం'

రామకృష్ణాపూర్, న్యూస్‌టుడే : కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి జరుగుతుందని, గత పదేళ్ల భారాస పాలనలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ అన్నారు. శనివారం మందమర్రిలో రూ.2.80 కోట్ల సీఎస్ఆర్ నిధులతో పలు అభివృద్ధి పనులకు ఎంపీ గడ్డం వంశీకృష్ణతో కలిసి శంకుస్థాపనలు చేశారు. అనంతరం వారు మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తున్నామన్నారు. నియోజకవర్గంలో సుమారు రూ.500 కోట్ల పనులు కొనసాగుతున్నాయని, సంవత్సరంలో పనులన్నీ పూర్తవుతాయని అన్నారు.


మందమర్రిలో శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వివేక్

వీధి కుక్కల తరలింపు

చెన్నూరు : చెన్నూరు పట్టణంలోని పలు వీధుల్లో సంచరిస్తున్న వీధి కుక్కలను శనివారం పురపాలక సంఘం అధికారులు మంచిర్యాలకు తరలించారు. పిచ్చి కుక్కల బెడద తీవ్రమవడంతో వాటిని పట్టించి శస్త్రచికిత్సల నిమిత్తం జంతు సంరక్షణ సంస్థ కేంద్రానికి తరలించినట్లు పురపాలిక కమిషనర్ గంగాధర్ తెలిపారు.

గుండె నొప్పితో సింగరేణి ఉద్యోగి మృతి

★ వైద్యుల నిర్లక్ష్యమేనని ఆరోపణ

గోదావరిఖని, న్యూస్‌టుడే: మంచిర్యాలలోని రామకృష్ణాపూర్ ఓసీపీలో ఓవర్‌మెన్‌గా పనిచేస్తున్న సురేష్(40) శనివారం హఠాన్మరణం చెందారు. సురేష్ ఉదయం ఛాతి నొప్పితో గోదావరిఖనిలోని సింగరేణి ఆసుపత్రిలో చేరాడు. ఇదివరకే అతను గుండె సంబంధిత వైద్యం చేయించుకున్నాడు. హైదరాబాద్ ఆసుపత్రిలో చికిత్స అందించేందుకు రెఫర్ చేయాలని అతని కుటుంబసభ్యులు వైద్యులను కోరారు. కరీంనగర్‌కు రెఫర్ చేయడంతో అక్కడికి వెళ్లేందుకు నిరాకరించారు. దీంతో అతని పరిస్థితి విషమంగా మారింది. చివరికి హైదరాబాద్ రెఫర్ చేసేందుకు వైద్యులు ఏర్పాటు చేశారు. మార్గమధ్యలో సురేష్ మృతిచెందాడు. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే మృతి చెందాడంటూ తెబొగకాసం నాయకులు ఆరోపిస్తున్నారు.


సురేష్

ఆ కుటుంబంలో వరుస విషాదాలు

స్థానిక పరశురాంనగర్‌కు చెందిన సురేష్ కుటుంబంలో నెల రోజుల్లో ముగ్గురు మృతి చెందడం.. కుటుంబసభ్యులకు తీరని శోకాన్ని మిగిల్చింది. సురేష్ శనివారం మృతి చెందగా.. గత నెల 16న అతని తల్లి భూమక్క, మూడు రోజుల క్రితం అతని సోదరుడు సంతోష్ అకాల మరణం చెందడం ఆ కుటుంబాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. మృతునికి భార్య, కుమారుడు ఉన్నారు.

పిట్ కమిటీ ఎన్నిక

శ్రీరాంపూర్ గ్రామీణం : శ్రీరాంపూర్ ఏరియా ఇంటర్నల్ ఆడిట్ విభాగం ఏఐటీయూసీ పిట్ కమిటీని ఎన్నుకొన్నారు. శనివారం ఆడిట్ కార్యాలయంలో నూతన పిట్ కార్యదర్శిగా రాజు, సహాయ కార్యదర్శిగా రాజశేఖర్, సంయుక్త కార్యదర్శిగా నరేష్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా మల్లేశ్, మౌనిక, కార్యవర్గ సభ్యులుగా హరి, రమేష్, ప్రియాంక, శ్రీనివాసులు ఎన్నికయ్యారు.


వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న జీఎం బి.సంజీవరెడ్డి

అటవీశాఖ ఉద్యోగులకు వైద్య శిబిరం

శ్రీరాంపూర్ గ్రామీణం : శ్రీరాంపూర్ ఏరియా పరిధిలో విధులు నిర్వహిస్తున్న అటవీ శాఖ ఉద్యోగులకు వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. శనివారం ఎస్‌సీఓఏ క్లబ్‌లో డీవైసీఎంఓ డాక్టర్ పి.రమేష్ బాబు ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరాన్ని ఏరియా జీఎం బి.సంజీవరెడ్డి ప్రారంభించారు.

ఐఎన్‌టీయూసీతోనే సమస్యల పరిష్కారం

శ్రీరాంపూర్ గ్రామీణం : కార్మికుల పెండింగ్ సమస్యల పరిష్కారం సింగరేణి కోల్‌మైన్స్ లేబర్ యూనియన్‌తోనే సాధ్యమవుతుందని ఆ సంఘం ఏరియా ఉపాధ్యక్షుడు శంకర్‌రావు పేర్కొన్నారు. శనివారం శ్రీరాంపూర్ ఉపరితల గని వద్ద మాట్లాడారు.

వినతులు

కన్నెపల్లి : కన్నెపల్లిలోని ప్రాథమిక పాఠశాలలో మరుగుదొడ్లు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని పిల్లల తల్లిదండ్రులు శనివారం తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు.

దండేపల్లి గ్రామీణం : మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన బియ్యం కోసం లక్సెట్టిపేట ఎంఎల్ఎస్ గోదాంకు వెళ్లడం ప్రధానోపాధ్యాయులకు ఇబ్బందికరంగా ఉంటోందని, మండల విద్యాధికారి వేలిముద్ర నమోదుతో పాఠశాలలకు బియ్యం సరఫరా చేయాలని పీఆర్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజేశ్వర్‌రావు, మండలాధ్యక్షుడు రవి కోరారు. ఈ మేరకు శనివారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ సిబ్బందికి వినతి పత్రం అందజేశారు.

తాండూరు : గ్రామ సభలు నిర్వహించిన తరువాతే ఇందిరమ్మ కమిటీలు వేయాలని భాజపా తాండూరు మండల అధ్యక్షుడు భరత్‌కుమార్ అన్నారు. కమిటీల ఏర్పాటు విషయమై శనివారం ఎంపీడీఓ శ్రీనివాస్‌కు వారు వినతిపత్రం అందజేశారు. భాజపా జిల్లా ఉపాధ్యక్షుడు తిరుపతి, ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి చిరంజీవి, మండల ప్రధాన కార్యదర్శి కుమార్, నాయకులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలు

మందమర్రి పట్టణం : పోలీసు స్మారక దినోత్సవ సందర్భంగా శనివారం మందమర్రి సింగరేణి పాఠశాల విద్యార్థులకు పోలీసుల విధులు-చట్టాలు అనే అంశంపై అవగాహన కల్పించారు. అనంతరం వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి విజేతలను ఎంపిక చేశారు. ఎస్సై రాజశేఖర్, ఏఎస్ఐ మల్లేశం, హోంగార్డు శ్రావణ్ కుమార్, ప్రిన్సిపల్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల పరామర్శ

హాజీపూర్ : మండలంలోని రాపల్లి సమీపంలో ఇటీవల జరిగిన గొడవలో గాయపడి జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రాపల్లికి చెందిన రాజేష్, రాజశేఖర్‌లను శనివారం బ్లాక్, మండల కాంగ్రెస్ నాయకులు పరామర్శించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తిరుపతి, మండల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ అభ్యర్థుల ఎంపిక

మంచిర్యాల విద్యావిభాగం : ఎన్‌సీసీ శిక్షణతో విద్యార్థుల్లో క్రమశిక్షణ, దేశభక్తి అలవడుతుందని ఆదిలాబాద్ 31 బెటాలియన్ ఎన్‌సీసీ అధికారులు కవల్జిత్ సింగ్, కె.రవీందర్‌లు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని మిమ్స్ డిగ్రీ కళాశాలలో మొదటిసారిగా శనివారం ఎన్‌సీసీ ప్రవేశాలకు ఎంపిక ప్రక్రియను చేపట్టారు. ఆసక్తిగల విద్యార్థులకు దేహదారుఢ్య, మౌఖిక పరీక్షలను నిర్వహించి 56 మంది క్యాడెట్లను ఎంపికచేశారు.

గ్రూప్-1 అభ్యర్థులపై దాడి దుర్మార్గం

తాండూరు, న్యూస్‌టుడే: గ్రూప్-1 అభ్యర్థులపై పోలీసుల దాడి దుర్మార్గమైన చర్య అని తెలంగాణ నిరుద్యోగ ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలుముల శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. తాండూరు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గ్రూప్-1 అభ్యర్థుల ఆందోళనను పరిగణనలోకి తీసుకొని పరీక్షను వాయిదా వేసి జీఓ 29ను రద్దు చేయాలన్నారు.


విద్యార్థికి కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యురాలు

పాఠశాలలో కంటి వైద్య శిబిరం

మంచిర్యాల విద్యావిభాగం, న్యూస్‌టుడే : జిల్లా కేంద్రంలోని లక్ష్మీనగర్‌లోగల శ్రీచైతన్య ఉన్నత పాఠశాలలో శనివారం స్మార్ట్ లివింగ్ కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ప్రతిమ ఆసుపత్రి వైద్యురాలు డా. ప్రతిమ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని ఉన్నత స్థాయి విద్యార్థులకు వైద్యురాలు సిబ్బందితో కలిసి కంటి పరీక్షలు నిర్వహించారు.